క్లుప్తంగా

ముమ్మరంగా వరి కోతలు



పాలకొండ ప్రాంతంలో కోసిన వరి చేను

పాలకొండ: మండలంలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది పంటలు ముందుగా రావడంతో రైతులు కోతలు పూర్తి చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 80 శాతం కోతలు పూర్తయినట్లు వ్యవసాయశాఖ ఏఓ వాహిని తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆకాశం మబ్బు పట్టి ఉన్నా రైతులు కోతలు మాత్రం ఆపలేదు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు కోరారు.

లాభదాయంగా ఆయిల్‌పామ్ సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి అమరేశ్వరి

వీరఘట్టం: ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు లాభదాయంగా ఉంటుందని హార్టికల్చరల్ అధికారి అమరేశ్వరి సూచించారు. మండలంలోని కంబరవలసలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను సబ్సిడీపై అందిస్తామని శ్రీనివాస ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి. కళాధర్ సూచించారు. మండలంలని ఎస్.గోపాలపురంలో ఉన్న మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని, దీనివల్ల మీ తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని సూచించారు. అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ



యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుపతిరావు

గరుగుబిల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో బుధవారం 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా యువతకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఖైనీ, గుట్కా, సిగరెట్, గంజాయి, మద్యం, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, జీవితం అంధకారంగా మారుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వొద్దని, ఓటీపీ, ఏటీఎం పిన్ నంబరును ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1903 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు స్థానిక ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు, సిబ్బంది ఉన్నారు.

104 ఉద్యోగుల నిరసన

గరుగుబిల్లి: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొంకడివరంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 104 ఉద్యోగుల సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. 16 ఏళ్లుగా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న 104 ఉద్యోగులకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ల ద్వారా వైద్య సేవలను అందించేలా చూడాలన్నారు. 104 సర్వీసుల్లో పనిచేస్తున్న 326 మంది డ్రైవర్లను రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు క్రాంటాక్టు పద్ధతిలో నియమించాలని, ప్రతీ నెల సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డేటాఎంట్రీ ఆపరేటర్ శంకరరావు తదితరులున్నారు.

ముళ్లపొదల తొలగింపు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి-పెదమేరంగి మధ్య రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను బుధవారం తొలగించారు. చినమేరంగి ఎస్సై పి.అనీష్ ముళ్లపొదల తొలగింపు పనులను స్వయంగా పర్యవేక్షించారు.

శీతాకాలంలో.. చిన్నారులపై చలి పంజా

- న్యుమోనియాపై ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి
- సూచనలు పాటించాలంటున్న వైద్యులు

పాలకొండ రూరల్:

ప్రస్తుత శీతాకాల సీజన్‌లో ఐదిఈడు పిల్లల్లో ఎక్కువ మంది న్యుమోనియాతో పాటు వివిధ రకాల శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కేవలం కాలుష్యం, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, అపరిశుభ్రమైన పరిసరాలు, పౌష్టికాహార లోపం కూడా వ్యాధులకు ముఖ్య కారణమని వైద్యులు చెబుతున్నారు. ప్రత్యేకంగా న్యుమోనియా వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హెచ్చరిస్తున్నారు. దీనికోసం ప్రత్యేక కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాల్సిన బాధ్యత వైద్యారోగ్య శాఖపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వంలో వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఉండడంతో పాటు నింతర వైద్య సేవలు ప్రజల ముంగిటనే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో ఆరోగ్య సమస్య వస్తే దానిని గుర్తించి చికిత్స పొందేందుకు సమయంతో పాటు అధిక మొత్తం ఖర్చవుతోంది.



శ్వాశ్వ సంబంధిత సమస్యతో ఆస్పత్రుల బాట పడుతున్న చిన్నారులు

ఏడేళ్ల వయసు వరకు..

పిల్లలకు ఏడేళ్ల వయసు వచ్చే వరకూ వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా వీరు వాతావరణ మార్పులకు అనుగుణంగా శ్వాసకోశ వ్యాధులకు గురయ్యే ప్రమాదముందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్యం కారణంగా రెండేళ్లలోపు చిన్నారుల్లో ఆస్తమా లక్షణాలు పెరుగుతున్నాయి. ఎటువంటి కాలుష్యం లేని గిరిజన ప్రాంతాల్లో నివశించే చిన్నారుల్లో న్యుమోనియా రావడానికి ఇక్కడ ఉన్న శీతల వాతావరణం కొంతమేర కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో నవంబర్ మొదటి వారం నుంచి వాతావరణంలో చల్లదనం చోటుచేసుకుంది. చల్లని వాతావరణంలో తిరిగాడే చిన్నారులపై పడే ప్రభావంతో ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి అది న్యుమోనియాకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, ఆయాసం అధికమై చిన్నారులను ఆరోగ్యపరంగా ఇబ్బంది పెడుతోంది. ప్రస్తుత సీజన్‌లో చిన్నారులను ఆరుబయట తిరగకుండా చూసుకోవాలి. వారి శరీరానికి ఉష్ణాన్ని అందించే ఉన్ని వస్త్రాలను ధరింపచేయాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- పిల్లలు దగ్గు, జలుబు, తీవ్ర జ్వరంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటే సొంత వైద్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి.
- పిల్లలకు అతిగా యాంటీబయాటిక్స్ వాడడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో సులభంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ చోటుచేసుకునే అవకాశం ఉంది.
- నిపుణులైన వైద్యుల సిఫార్సు లేకుండా పిల్లలకు ఎటువంటి మందులు వాడకూడదు. ముఖ్యంగా పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు జింక్ సప్లిమెంట్‌ను అందించాలి.
- చంటి పిల్లలకు కనీసం తొమ్మిది నెలల పాటు తల్లిపాలు ఇస్తే పిల్లల్లో ఈ వ్యాధి తట్టుకునే రోగనిరోధక శక్తి సమకూరుతుంది.



వసతిగృహాల్లో పిల్లల ఆరోగ్య స్థితిగతులపై వైద్యుల ఆరా

నిర్లక్ష్యం చేయకూడదు..



ఐదేళ్లలోపు చిన్నారుల్లో దగ్గు, ఆయాసం, జలుబు వంటి న్యుమోనియా లక్షణాలున్నప్పుడు అలసత్వం చేయొద్దు. వ్యాధి నిర్ధారణకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరుగుతుంది. ముఖ్యంగా ఏజెన్సీ నుంచి ఈ తరహా లక్షణాలతో పిల్లలు వస్తున్నారు. సకాలంలో స్పందించి వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. వ్యాధి నివారణా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. నేటి నుంచి క్షేత్ర స్థాయిలో 'సాన్స్' సర్వే చేపడుతున్నాం. ఈ క్రమంలో గ్రామాలు, పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రత్యేక శిబిరాలు చేపడతాం.

–జి.గిరీష, డాక్టర్, వీరఘట్టం పీహెచ్‌సీ

- ఐదేళ్లలోపు చిన్నారులను న్యుమోనియా అధికంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది.
- పాఠశాలలకు వెళ్లే పిల్లల రోజువారీ ఆరోగ్య స్థితిగతులను తల్లితండ్రులు లేదా సంరక్షకులు గమనిస్తుండాలి.
- పిల్లలు చలిని తట్టుకునేలా వస్త్రాధారణ చేయించాలి. కాచి చల్లార్చిన నీరు. వేడి ఆహార పదార్థాలు అందించాలి.

కార్తీక జ్యోతులు..

కార్తీక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయంలో దీపార్చన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకుడు కూర్మనాథశర్మ మాట్లాడుతూ, పవిత్ర కార్తీకమాసంలో భక్తులు వెలిగించే జ్యోతులకు ఎంతో విశిష్టత ఉంటుందన్నారు. అలాగే పాట్లి గ్రామంలోని సద్గురు షిరిడీ సాయి మందిరంలో లక్ష దీపార్చన కార్యక్రమంలో భాగంగా మహాలింగ రూపంలో భక్తులు జ్యోతులు వెలిగించారు.

– పాలకొండ రూరల్



60 మందికి కంటి పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నెల్లికిక్కువ గ్రామంలో యస్ సొసైటీ సహకారంతో విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు గాయత్రి, పూజిత సేవలందించారు. సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేయగా, వారిలో 26 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పుష్పగిరి కంటి ఆస్పత్రి మేనేజర్ రమాదేవి మాట్లాడుతూ కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారికి ఉచిత రవాణా, భోజన, వసతి సౌకర్యాలు కల్పించి ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ భీమశంకర్, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ ఉన్నారు.



కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జాబ్‌మేళాలో 36 మంది ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో డీమార్ట్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంఎస్‌ఎన్ ల్యాబ్, ఆర్‌బీఎల్‌డీబీఎస్ బ్యాంక్, డైకిన్ కంపెనీకు చెందిన 15 మంది ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 52 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా వారిలో 36 మందిని రెండో దశకు ఎంపిక చేశారు. రెండో దశలో సెలక్ట్ అయిన వారికి శిక్షణ ఇచ్చి ఆయా కంపెనీల్లో ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కల్పన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

సమయం వృథా చేసుకోవద్దు..

పాలకొండ రూరల్: విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి అన్నారు. కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, ఉపన్యాసకులు మాట్లాడుతూ.. చిరిగిన దుస్తులుధరించైనా.. మంచి పుస్తకం కనుగోలు చేసి చదువుకోవాలని మహాత్మా గాంధీ సూచించారన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వివరించారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, గ్రంథపాలకుడు పి.ఉమాసోమిత్‌రాజు, శ్రీనివాసరావు, రాఘవేంద్రనాయుడు, పి.రాజ్యలక్ష్మి, జగన్‌మోహనరావు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్స్‌పాల్ జయమణి

ఎన్నికల హామీలు అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వేణు

పాలకొండ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నవోదయనగర్‌లో సీపీఎం మండల రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలు అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇంటింట ప్రచారం చేపడతామని తెలిపారు. పాలకొండ పట్టణంలో డంపింగ్ యార్డు, సాగునీటి కాలువల సమస్యలు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్‌గా దావాల రమణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఇటీవల మరణించిన సీతారాం ఏచూరికి సంతాపం తెలిపారు. సమావేశంలో ఎం. తిరుపతిరావు, ఎ. లక్ష్మణరావు, కె. రాము, డి. దుర్గారావు, ఎస్. భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.



మండల సభలో మాట్లాడుతున్న వేణు

ఆహ్వానం..

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించడానికి ముఖ్య వ్యక్తులకు ఆహ్వానించినట్టు లైబ్రేరియన్ బబ్బూరు గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డితో పాటు వివిధ ఆశ్రమ పాఠశాలలు, హైస్కూళ్ల హెచ్‌ఎంలకు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

'అక్షరాస్యులు కావాలి'

సీతంపేట: మహిళా సంఘ సభ్యులంతా అక్షరాస్యులు కావాలని వెలుగు ఏపీఎం కమలకుమారి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 ఏళ్ల దాటిన ప్రతీ ఒక్క మహిళా అక్షరాలు నేర్చుకోవాలన్నారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో అక్షరాస్యత సాధ్యం..

భామిని: మహిళల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు ఉల్లాస్ కార్యక్రమం దోహద పడుతుందని వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఏఓలు, వలంటీర్లకు ఉల్లాస్‌పై శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2030 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఎంఎంఎస్ అధ్యక్షురాలు బిడ్డిక హైమావతి, కోశాధికారి పడాల విజయలక్ష్మి, కార్యదర్శి భూపతి భవానీ మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు, వలంటీర్ పాల్గొన్నారు.



భామిని: ఉల్లాస్ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం చక్రపాణి

నేటి నుంచి సహకార వారోత్సవాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఈ నెల 14 నుంచి 20 వరకు 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ ఎన్.గుంపస్వామి బుధవారం తెలిపారు. గురువారం సహకారశాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించడం, 15న నూతన ఆవిష్కరణలు, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెపొందించడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాలకు సహకారం పెంపొందించడం, 20న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

వీరఘట్టం: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టి ఇసుక తరలిస్తే శాఖపరంగా కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ బి.వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నాగావళి నదీ తీర ప్రాంతాలైన నడిమికెల్ల, కడకెల్ల, విక్రమపురం, చిట్టపులివలస, కిమ్మి, పాలమెట్ట, బిటివాడ, ఎం.వి.పురం, పనసనందివాడ ర్యాంపుల పర్యవేక్షణకు అధికారులను నియమించామన్నారు. స్థానిక అవసరాలకు ఇసుక కావాల్సిన వారు సంబంధిత సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ వద్ద తమ వివరాలు నమోదు చేసుకుని, డిజిటల్ అసిస్టెంట్ ఇచ్చే రశీదును ర్యాంపు వద్ద ఉండే అధికారులకు చూపించి ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని సూచించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు బుధవారం తెలిపారు. వారం రోజుల పాటు విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే పుస్తక ప్రదర్శన తో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అభినందనలు..



ఐటీడీఏ పరిధిలో వివిధ గురుకులాలు, ఆశ్రమపాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా వారికి స్పోర్ట్స్ షూలు పంపిణీ చేశారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పెద్దమడి బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి ఎం.కృపాసింధు, పూతికవలస నుంచి ఎస్.సమిత జాతీయ ట్రిపుల్ జంప్ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట

అప్రమత్తం..



మహిళా పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎం. రాంబాబు అన్నారు. సీతంపేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలు, రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై వై.అమ్మన్నరావు పాల్గొన్నారు.

– సీతంపేట

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



గరుగుబిల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ సుగుణకుమారి



జియ్యమ్మవలస: శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో రమేష్, వెలుగు ఏపీఎం నాగభూషణరావు

గరుగుబిల్లి: గ్రామాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఐసీడీఎస్ కొమరాడ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏపీఎం పి.అప్పలనాయుడు, సీనియర్ సహాయకుడు రవి రాంప్రసాద్, తదితరులున్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ

జియ్యమ్మవలస: మండలంలోని ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో ఉల్లాస్ కార్యక్రమంపై బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కొంతమంది వలంటీర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రమేష్ తెలిపారు.

రక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి

- విశాఖ సీఐడీ డీఎస్పీ భూపాల్

భామిని: కుల వివక్ష నిర్మూలన.. ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ వేధింపుల నివారణకు రాజ్యాంగపరంగా వచ్చిన రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని విశాఖ సీఐడీ డీఎస్పీ ఎం.ఎస్.భూపాల్ అన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సీఐడీ విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, పీఓఏ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం చదవాలని పిలుపునిచ్చారు. అట్రాసిటీ బాధితులకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక, సాంఘిక సహాయం చేసి ఆదుకుంటామని ఐటీడీఏ ఏఎస్‌డబ్ల్యూఓ మంగవేణి అన్నారు. పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేస్తామన్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, లెక్చరర్ ముత్యాలరావు, తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ గుండేలా చంద్రరావు తాము సమాజంలో ఎదుర్కొన్న కుల వివక్ష వేధింపులపై వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీఐడీ సీఐ బీవీ రమణమూర్తి,ఎస్సై రవి, ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్, దళిత సంఘ నాయకుడు లోపింటి రాజేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.



వక్తల అభిప్రాయాలకు వివరణ ఇస్తున్న డీఎస్పీ భూపాల్

వైభవంగా ద్వాదశి పూజలు

గరుగుబిల్లి: కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దూరు, గరుగుబిల్లి, కొత్తూరు, సంతోషపురం, రావివలస, బురద వెంకటాపురం తదితర గ్రామాల్లోని రామ మందిరాల్లోని విగ్రహాలను, పూజా సామగ్రిని శుద్ధిచేసి పూజలు చేశారు. అఖండ దీపారాధన, హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తనలు, భజన పాటలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం పీహెచ్‌సీ పరిధిలోని సాకి, తియ్యాలి, తియ్యాలిగూడ, వబ్బంగి, కాకిలి గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామాలలో మలేరియా, డెంగీ వ్యాధుల పరిస్థితిని అంచనా వేశారు. గ్రామాల్లో ఉన్న నీటి నిల్వలను తొలగించాలని, దోమలు పెరగకుండా తగిన విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలకు, ఆశాలకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. జ్వరాల కేసులపై వైద్యాధికారి అభినయ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్ యూనిట్ అధికారి మోహన్, సూపర్‌వైజర్ శ్రీహరి ఉన్నారు.